క్లుప్తంగా

శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు: సీపీ

సిద్దిపేటకమాన్: శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర నిర్వహించుకోవాలని సీపీ అనురాధ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిమజ్జనోత్సవాల్లో భాగంగా కోమటి చెరువుతోపాటు పలు చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుకు 859 మంది అధికారులు, సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని, వాహనదారులు గమనించాలని సూచించారు.

మహా అన్నదానం


మహాప్రసాదానికి పూజ చేస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మహా అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అధికారులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఈఓ బుద్ది శ్రీనివాస్, శ్రీరాములు, అర్చకులు ఆంజనేయులు, భాస్కర్, మనోహర్, బసవేశ్వర్, సూర్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని ఎత్తివేస్తే సహించం: బీఆర్ఎస్వీ నేత


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్: ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎత్తివేసే కుట్ర జరిగితే సహించేది లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని బాలికల వసతి గృహంలో వార్డెన్ నిర్లక్ష్యం వల్లే ప్రవేశాలు తగ్గాయన్నారు. విద్యార్థినులు ఎవ్వరూ లేరనే నెపంతో హాస్టల్‌ను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని వాపోయారు. విద్యార్థుల తరఫున పోరాటం చేసి హాస్టల్‌ను కాపాడుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, వికాస్ యాదవ్, యాస శ్రీనివాస్‌లు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. డీటీఎఫ్ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో డీఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, వాసుదేవరెడ్డి, తిరుపతి, వెంకటరమణారెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన


మాట్లాడుతున్న శాస్త్రవేత్త వినోద్‌కుమార్

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రైతువేదికలో 'మేరా రేషమ్ మేరా అభియాన్' కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మోహన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఈ సదస్సులో శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. మల్బరీకి ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలు, అలాగే ఆకు దిగుబడి మెరుగుపర్చడానికి పోషణ్ వాడకం గురించి వివరించారు. ఏఈఓ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

పండుగలతో సమాజంలో ఐక్యత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పండుగలతో సమాజంలో ఐక్యత పెంపొందుతుందని టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. మార్కండేయ ఆలయంలో గురువారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో సీఐని పద్మశాలీ సమాజ సభ్యులు ఘనంగా సన్మానించారు. రాజేశం, అశోక్, శ్రీహరి, బాల్‌రాజు, రవితేజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనల్లేక వెతలు

రహదారులు గ్రామాల మధ్య వారధులు కానీ కాలువల వల్ల ఆ రోడ్లపై రాకపోకలు నిలిచిపోయి సంబంధాలు తెగిపోతున్నాయి. ఇది ఎన్నోయేళ్లుగా కొనసాగుతోంది. ఆయా గ్రామస్తులకు చినుకు పడినా, కాలువల్లో ప్రవాహం పెరిగినా గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. ఈ కథ ఎప్పటికి మారుందోనని ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు. కానీ ఫలితం కానరావడం లేదు.

దుబ్బాకరూరల్:

- చినుకు పడితే చాలు రాకపోకలు బంద్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- గ్రామస్తులకు తప్పని తిప్పలు


ఇటీవల కురిసిన వర్షాలకు ఆకారం బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద

మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో రహదారులకు అడ్డంగా ఉన్న కాల్వలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని రాజక్కపేట మధిర గ్రామమైన ఎల్లాపూర్, బల్వంతాపూర్, గోసాన్‌పల్లి, ఆకారం గ్రామాలలోని రోడ్లకు అడ్డంగా కాలువలు ఉన్నాయి. ఎన్నోయేళ్లుగా బ్రిడ్జిలు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు బంద్ అవుతున్నాయి.

పట్టించుకోని నేతలు

ఎల్లాపూర్‌తోపాటు మిగతా గ్రామాల్లోని కాలువలపై బ్రిడ్జిలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఎన్నోసార్లు ఎమ్మెల్యే, ఎంపీలకు విన్నవించారు. కాని ఫలితం మాత్రం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్వంతాపూర్ రోడ్డుకు అడ్డంగా కాలువకు ప్రస్తుతం మల్లన్నసాగర్ నీళ్లు రావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. బ్రిడ్జికోసం అడిగితే గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర నాయకులు వచ్చి పరిశీలించి వెళ్లారు తప్ప ఎలాంటి నిధులు కేటాయించలేదు. అదేవిధంగా గోసాన్‌పల్లి కాలువ వద్ద తరచూ ప్రమాదాలు నెలకొంటున్నాయి. పలువురు వాహనదారులు మృతి చెందిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఆకారం గ్రామం మీదుగా కూడవెల్లి పెద్ద వాగు ప్రవహిస్తుంది. చిన్నపాటి వర్షాలు కురిసినా బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుంది. ఈ బ్రిడ్జి ఎత్తును పెంచి నూతనంగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


బల్వంతాపూర్ రోడ్డుపై నీటి ప్రవాహం


రాజక్కపేట-ఎల్లాపూర్ రోడ్డుపై నాట్లు వేస్తూ యువకుల నిరసన

వర్షం కురిస్తే రాకపోకలు బంద్



మాది రాజక్కపేట మధిర గ్రామమైన ఎల్లాపూర్. మా గ్రామానికి వెళ్లాలంటే పెద్దకాలువ దాటాల్సి ఉంటుంది. ఒకవేళ వర్షం కురిస్తే నీటి ఉధృతి పెరగడంతో గ్రామానికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. రాకపోకలు స్తంభించి పోతాయి. ఈ కాలువపై బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదు. కాలువపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నాం.

– శేఖర్, ఎల్లాపూర్

క్రీడల్లో గెలుపోటములు సహజం

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మూడు రోజులుగా కొనసాగిన ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో నిర్వహించిన ముగింపు కార్యక్రమాల్లో ఎంఈఓలు, ముఖ్య అతిథులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆటల్లో జయాపజయాలు సహజమని, విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోను రాణించాలని కోరారు.


చేర్యాల(సిద్దిపేట): గెలుపొందిన విద్యార్థులతో ఎంఈఓ కిష్టయ్య, పీఈటీలు

చేర్యాల(సిద్దిపేట): అక్కన్నపేట(హుస్నాబాద్):ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):తొగుట(దుబ్బాక):మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలలో ఎంఈఓ రచ్చ కిష్టయ్య పాల్గొని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గంజి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి సురేందర్ అందించిన బహుమతులను సిద్దిపేట ఏఎస్ఓ వైన ర్సింహులుతో కలిసి క్రీడాకారులకు ప్రదానం చేశారు. బహుమతులు అందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహాచారి, ఎస్జీఫ్ కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు. అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ రంగానాయక్, నాయకులు తిరుపతినాయక్, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న క్రీడలను మండల విద్యాశాఖ అధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. బెజ్జంకి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓ మహతిలక్ష్మి, ప్రిన్సిపాల్ సంగీత, క్రీడల సెక్రటరీ మాలతి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరాములు, వడ్లూరు బేగంపేట హెచ్‌ఎం గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొగుట పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రీడల్లో వెంకట్రావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వారిని హెచ్‌ఎం నయీమా కౌసర్, పీడీ కనకయ్యను అభినందించారు. అదే విధంగా సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడకలో ఎంఈఓ రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడల్లో విజయం సాధించి 68 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను చింతమడక విద్యార్థులు కైవసం చేసుకున్నారు. హెచ్‌ఎం రమణారెడ్డి, బాల్‌రాజు, రాజు, అశోక్, పీడీలు వెంకటస్వామి, సుశీల, శారద, నవీన్, లక్ష్మణ్, కర్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మద్దూరు ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, ఎంఈఓ వరదరాజులు పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో కూడా ప్రతిభ చూపాలని కోరారు.

టీఎంఎల్ మేళా ముగింపు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్లో టీఎంఎల్ మేళా ముగింపు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ రకాల ఎగ్జిబిట్లను మేళాలో ప్రదర్శించారు. ఎంఈఓ బచ్చలి సత్తయ్య, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ రమేశ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

చెత్తవేస్తే చర్యలు కఠిన చర్యలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయ పరిసరాలలో చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలయ ఏఈఓ బుద్ది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాలలో చెత్త వేయడం వల్ల స్థానికులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణాదారులు చెత్తను వేరుచేసి పంచాయతీ చెత్త బండిలో వేయాలని సూచించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుడికి పూజలు


దుబ్బాకటౌన్: మిత్రయూత్ ఆధ్వర్యంలో..


వర్గల్(గజ్వేల్): నాచగిరిలో శోభాయాత్ర


కొండపాక(గజ్వేల్): సిర్సనగండ్లలో..

కేంద్ర పథకాలు సక్రమంగా అందాలి

కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల గురించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీలు పూర్తిచేసి వడ్డీలేని రుణాలు అందజేయాలని చెప్పారు. వృద్ధాప్య, దివ్యాంగులు, డయాలసిస్, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. సీఆర్ఎఫ్ కింద రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో జారీచేసిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రతీ ఇంటికీ ఈ కరపత్రం అందజేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో గిరిజన కళాశాల బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ హైమావతి గురువారం సందర్శించారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని వార్డెన్‌ను ఆదేశించారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సిద్దిపేటఅర్బన్: అర్బన్ మండలం ఎల్లుపల్లి శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీటిని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

నిమజ్జనం ఏర్పాట్లపై ఆరా

సిద్దిపేటజోన్: వినాయక నిమజ్జనం సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కోమటి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. బ్యారికేడ్లు, క్రేన్, అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్, సీఐ వాసుదేవరావు ఉన్నారు.

ఆకట్టుకున్న 'యూత్ పార్లమెంట్'


యూత్‌పార్లమెంట్ సెషన్ నిర్వహిస్తున్న విద్యార్థులు


- సభ్యుల వాడీవేడి చర్చ, తీర్మానాల ఆమోదం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

వర్గల్(గజ్వేల్): వాడీవేడి చర్చలు, బిల్లులు, తీర్మానాలతో వర్గల్ నవోదయలో యూత్‌పార్లమెంట్ ఆకట్టుకొంది. స్పీకర్, ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, మంత్రులు తదితర పాత్రలలో విద్యార్థులు పార్లమెంట్‌ను తలపించేలా సభను రక్తి కట్టించారు. నవోదయ రీజియన్ స్థాయి యూత్‌పార్లమెంట్ పోటీలో భాగంగా గురువారం వర్గల్ విద్యార్థుల యూత్ పార్లమెంట్ సెషన్ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, పూలే వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు హాజరై న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తొలుత లోక్‌సభ సభ్యుల ప్రమాణస్వీకారం, ప్రధాన మంత్రి కొత్త మంత్రులను పరిచయం చేయడం, ప్రశ్నోత్తరాల కార్యక్రమం, రైతుల ఆత్మహత్యలపై చర్చ, బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిపై ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చ కొనసాగాయి. చర్చలు, వాదోపవాదాలతో విద్యార్థులు శాసనమండలిని తలపించారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్‌లో ప్రజాప్రతినిధులుగా రాణించాలని ఆకాంక్షించారు. గోవిందరావు, ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ మాట్లాడారు. అధ్యాపకులు భాస్కర్, వెంకటేశు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. తమ ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, వారి సేవలు మరువలేనివని కొనియారు.


హుస్నాబాద్: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతిని సన్మానిస్తున్న అధ్యాపకులు


మిరుదొడ్డి(దుబ్బాక): సన్మానం పొందిన మండల పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు


అక్కన్నపేట(హుస్నాబాద్): ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానించిన లింగమూర్తి


దుబ్బాకలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

సంక్షిప్త వార్తలు

◆ పత్తికుంటలో డంపింగ్ యార్డ్ వద్దు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ పరిధి పత్తికుంటలో డంపింగ్ యార్డ్ నిర్మించవద్దని పలువురు రైతులు గురువారం తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ శోభ, పంచాయతీ కార్యదర్శి మాధురికి వినతిపత్రాలు అందించారు. తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దుర్గారెడ్డి, భూంరెడ్డి, బాబు, ప్రభాకర్, మొగిలి, రమేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

◆ దంపింగ్ యార్డులోనే చెత్తవేయాలి

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగు యార్డులోనే వేయాలని పలువురు రైతులు మున్సిపల్ అధికారులను కోరారు. గురువారం తూర్పు గుంటూరుపల్లి ప్రాంత రైతులతో కలిసి మాజీ కౌన్సిలర్ చెవిటి లింగం మాట్లాడుతూ కొన్ని నెలలుగా సేకరించిన చెత్తను ప్రైవేట్ వ్యక్తులకు చెందిన స్థలంలో వేస్తున్నారన్నారు. దీనివల్ల పరిసర రైతులకు ఇబ్బందిగా ఉందని వాపోయారు. రైతులు రాయుడు, చంద్రయ్య, అయోధ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

◆ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

తొగుట(దుబ్బాక): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుక్కాపూర్‌లో మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం గురవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు నరేందర్‌రెడ్డి, స్వామి, శ్రీనాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ నిబంధనలు ఉండొద్దు

కోహెడరూరల్(హుస్నాబాద్): తోటపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రాంచంద్రపూర్ రైతులకు పాస్‌బుక్ నిబంధనలు లేకుండా యూరియా అందించాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌తో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. వికాస్‌రెడ్డి, లక్ష్మణ్, దామోదర్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

దుబ్బాకటౌన్: దుబ్బాకలో శనివారం నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కీర్తిరాజుతో కలిసి పట్టణంలోని పెద్ద చెరువును గురువారం పరిశీలించారు. గజ ఈతగాళ్లను, చెరువుకట్ట వద్ద క్రేన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

◆ బాలసదనంలో వైద్యుల పరిశీలన

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని అనాథ పిల్లల బాలసదనాన్ని వైద్య అధికారులు గురువారం సందర్శించారు. పిల్లలు ఇటీవల వైరల్ ఫీవర్‌కు గురవ్వడంతోఉన్నతాధికారుల సూచన మేరకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్, వైద్యురాలు తన్మయి ఆధ్వర్యంలో బాలసదనాన్ని సందర్శించారు.

◆ ట్రెజరీ కార్యాలయం సందర్శన

గజ్వేల్: హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో శిక్షణ పొందుతున్న జూనియర్ అకౌంటెంట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా గురువారం గజ్వేల్‌లోని డివిజనల్ సబ్ ట్రెజరీ ఆఫీస్‌ను సందర్శించారు. ఉద్యోగులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కోర్సు డైరెక్టర్ రాధాకృష్ణ, ఫ్యాకల్టీ బాలరాజు, స్థానిక ట్రెజరీ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సబ్సిడీపై యంత్ర పరికరాలు

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళా రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి బత్తిని సత్యాన్వేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 5 రోటవేటర్లు, 5 తైవాన్ స్ప్రేయర్లు, ఒక పవర్ వాడర్ (బ్రష్ కట్టర్) అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు ఫారంతోపాటు, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ, పట్టాదారు పాస్ పుస్తకం ప్రతులను సంబంధిత వ్యవసాయ అధికారులకు అందించాలని సూచించారు.

◆ ప్రింటర్ అందజేత

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలని రిటైర్డ్ హెచ్‌ఎం జయసింహారెడ్డి సూచించారు. మండల పరిధిలోని సింగాటం ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆయన ప్రింటర్ అందజేశారు. విద్యార్థులకు అవసరమయ్యే వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. హెచ్‌ఎంలు సంతోష్, శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు పెన్షన్‌దారుల సన్నాహక సభ

దుబ్బాకటౌన్: దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల హక్కుల సాధనకు దుబ్బాకలోని కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించనున్న సన్నాహకసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా కో-ఆర్డినేటర్ దండు శంకర్‌తో కలిసి ఆయన గురువారం ఆయన మాట్లాడారు.